రూ.500 పెరిగిన బంగారం

తులం రూ.60,490

హైదరాబాద్, అక్టోబర్ 18: మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నేపథ్యంలో గత వారాంతంలో ఒక్కసారిగా భగ్గుమన్న బంగారం ధర రెండు రోజులపాటు క్రమేపీ తగ్గిన తర్వాత తిరిగి బుధవారం జోరందుకుంది. ప్రపంచ స్పాట్ మార్కెట్లో కడపటి సమాచారం అందేసరికి ఔన్సు పుత్తడి 22 డాలర్ల మేర పెరిగి 1,945 డాలర్ల సమీపంలో ట్రేడవుతున్నది. ఇది ఒకదశలో 1,960 డాలర్ల స్థాయిని సైతం చేరింది. గాజాలో హాస్పిటల్‌పై జరిగిన దాడులతో మధ్యప్రాచ్యంలో సంక్షోభం తీవ్రతరమయ్యిందని, దీంతో ప్రపంచ మార్కెట్లో పుత్తడి ధర నాలుగు వారాల గరిష్ఠస్థాయికి చేరిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ అనలిస్ట్ సౌమిల్ గాంధి తెలిపారు. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.540 మేర పెరిగి రూ.60,490 వద్దకు చేరింది. 22 క్యారెట్ల పుత్తడి రూ.500 అధికమై రూ.55,450 వద్ద నిలిచింది.

పెరగనున్న లెక్సస్ కార్ల ధరలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: లగ్జరీ కార్ల తయారీ సంస్థ లెక్సస్.. ధరలు పెంచే యోచనలో ఉన్నది. ఉత్పత్తి వ్యయం అధికమవడంతోపాటు రూపాయి విలువ పడిపోవడంతో వచ్చే నెల నుంచి వాహన ధరలను పెంచాలనుకుంటున్నట్టు లెక్సస్ ఇండియా ప్రెసిడెంట్ నవీన్ సోనీ తెలిపారు. ప్రస్తుతం సంస్థ రూ.62 లక్షల నుంచి రూ.3 కోట్ల లోపు ఆరు మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది. ధరలను ఎంతమేర పెంచేదానిపై ఈ నెల చివర్లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు ఆయన చెప్పారు.

తెలంగాణపై ఫాక్స్‌కాన్ ఫోకస్

126 కోట్లతో 5 లక్షలకుపైగా చదరపు గజాల స్థలం కొనుగోలు

రాష్ట్రంలో ఉత్పాదక కేంద్రాల విస్తరణ దిశగా అడుగులు

లక్ష ఉద్యోగాలను ఇస్తామని ఇప్పటికే ప్రకటించిన సంస్థ

కొంగరకలాన్ ప్లాంట్ తొలి దశతో 25 వేల కొలువులు

హైదరాబాద్, అక్టోబర్ 18: తైవాన్‌కు చెందిన బహుళజాతి ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్.. రాష్ట్రంలో పెట్టుబడుల విషయమై దూకుడును ప్రదర్శిస్తున్నది. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున భూమిని కొనుగోలు చేసింది. దాదాపు రూ.126 కోట్లతో 5 లక్షలకుపైగా చదరపు గజాల స్థలాన్ని (సుమారు 105 ఎకరాలు) సొంతం చేసుకున్నది. ఈ ఏడాది మార్చి 2న హైదరాబాద్‌లో ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియూ పర్యటించిన నేపథ్యంలో ఈ డీల్ అంత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. నాడు తెలంగాణలో లక్ష ఉద్యోగాలను సృష్టించేందుకు ఫాక్స్‌కాన్ కట్టుబడి ఉన్నదని లియూ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులోభాగంగానే హైదరాబాద్ సమీపంలోని కొంగరకలాన్ వద్ద యాపిల్ యాక్సరీస్ ఉత్పాదక కేంద్రానికి ఫాక్స్‌కాన్ ఈ మే నెలలో శ్రీకారం చుట్టిన సంగతి విదితమే. ఈ ప్లాంట్ భూమిపూజకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తోపాటు ఇతర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరవగా.. ఇది పూర్తయితే తొలి దశ కింద 25వేల ఉద్యోగాలు రానున్నాయి. సుమారు రూ.5,000 కోట్ల పెట్టుబడితో తెస్తున్న ఈ ఉత్పాదక కేంద్రంలో యాపిల్ ఎయిర్‌పాడ్స్, ఇతర యాక్సరీస్ తయారు కానున్నాయి. ఈ క్రమంలో తాజా భూముల కొనుగోళ్లు ప్లాంట్ల విస్తరణకేనన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయిప్పుడు. అమెరికా బహుళజాతి టెక్నాలజీ దిగ్గజం యాపిల్‌కు యాక్సరీస్‌పరంగా అతిపెద్ద కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరర్‌గా ఫాక్స్‌కాన్ కొనసాగుతున్నది తెలిసిందే. మరోవైపు దేశీయ ప్రముఖ రియల్ ఎస్టేట్ డాటా, అనలిటిక్స్, వర్క్‌ఫ్లో సొల్యూషన్స్ వేదిక ప్రాప్‌స్టాక్ వివరాల ప్రకారం చాంగ్ యీ ఇంటర్‌కనెక్ట్ టెక్నాలజీ (ఇండియా).. 2027కల్లా ఇక్కడి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, కంపోనెంట్స్ తయారీలో రూ.58.24 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు తెలుస్తున్నది. ఇది తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ రంగానికి మరింత ఉత్సాహాన్నిస్తున్నది. ఇదిలావుంటే రాబోయే ఫాక్స్‌కాన్ ప్రాజెక్టు.. భారత్‌లో ఆ సంస్థకు భారీ పెట్టుబడిగా నిలుస్తున్నది. ఇప్పటిదాకా ఫాక్స్‌కాన్ ఒంటరిగా ఈ స్థాయిలో దేశంలో పెట్టుబడి పెట్టిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో తెలంగాణలో మరింత విస్తరించాలని ఫాక్స్‌కాన్ అనుబంధ సంస్థ ఫాక్స్‌కాన్ ఇంటర్‌కనెక్ట్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎఫ్ఐటీఎల్) చేస్తున్న ప్రయత్నాలు.. రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులకు, కొలువులకు వీలు కల్పిస్తున్నది.

సీఎం కేసీఆర్ సమక్షంలో ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకుంటున్న దృశ్యం. చిత్రంలో మంత్రి కేటీఆర్, జయేశ్ రంజన్ తదితరులు (ఫైల్)

లాట్ మొబైల్స్‌లో దసరా ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 18: దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని స్మార్ట్ మొబైల్ ఫోన్ల రిటైల్ సంస్థ లాట్ మొబైల్స్ ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్ ఎం అఖిల్ మాట్లాడుతూ.. దసరా పండుగ సందర్భంగా కస్టమర్లు కొనుగోళ్లపై ఖచ్చితమైన బహుమతితో పాటు రూ.10 వేల వరకు క్యాష్‌బ్యాక్‌ను కూడా అందిస్తున్నట్టు చెప్పారు. ఎంపికచేసిన మాడల్ మొబైళ్లు, ఇతర వస్తువులను కొనుగోలు చేసినవారికి జీరో డౌన్ పేమెంట్ కూడిన రుణ సదుపాయాన్ని, 24 నెలల వ్యవధితో కూడిన నో కాస్ట్ ఈఎంఐ సదుపాయాన్ని కూడా అందిస్తున్నది. దీంతోపాటు రూ.999కే స్మార్ట్ వాచ్, సౌండర్ బార్ ఊఫర్‌తో కూడిన స్మార్ట్ టీవీ కాంబో ఆఫర్, అన్ని బ్రాండెడ్ యాక్సెసరీలు, ఇతర వస్తువుల కొనుగోళ్లపై 60 శాతం వరకు తక్షణ డిస్కౌంట్ కూడా సంస్థ ఇస్తున్నది. రూ.8,999 ప్రారంభ ధరతో స్మార్ట్ టీవీ, రూ.16,500 ధరతో ల్యాప్‌టాప్‌లు లభించనున్నాయని కంపెనీ మరో డైరెక్టర్ సుప్రజ తెలిపారు. స్మార్ట్ టీవీపై రూ.7,499 వరకు, ల్యాప్‌టాప్‌పై రూ.4 వేల వరకు క్యాష్‌బ్యాక్, స్మార్ట్ టీవీని కొనుగోలు చేసిన వారికి రూ.17,999 విలువైన సౌండ్ బార్ ఊఫర్‌ను కేవలం రూ.5,999కే అందిస్తున్నది.

దైకిన్ అతిపెద్ద అవుట్‌లెట్

హైదరాబాద్, అక్టోబర్ 18: జపాన్‌కు చెందిన ఏసీల తయారీ సంస్థ దైకిన్.. దక్షిణాదిలో అతిపెద్ద అవుట్‌లెట్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఈ షోరూంను కంపెనీ సీఎండీ కన్వల్‌జీత్ జావా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కంపెనీకి సంబంధించిన అన్ని ఉత్పత్తులపై ఒకేతాటి పైకి తేవాలనే ఉద్దేశంతో ఈ అతిపెద్ద అవుట్‌లెట్‌ను ఆరంభించినట్టు చెప్పారు. ప్రపంచ దేశాలు పలు సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో భారత్ మాత్రం అన్ని రంగాల్లో దూసుకుపోతున్నదని, ముఖ్యంగా తయారీ, వ్యవసాయం, రియల్ ఎస్టేట్, ఐటీ రంగాలు అంచనాలకు మించి రాణిస్తున్నాయన్నారు. రెండు వేల కోట్ల పెట్టుబడితో ఏపీలోని శ్రీసిటీ వద్ద సంస్థ ఏర్పాటు చేస్తున్న ఏసీల యూనిట్‌ను వచ్చే నెల చివర్లో ప్రారంభిస్తున్నది.

హైదరాబాద్‌లో రికార్డు రిజిస్ట్రేషన్లు

సెప్టెంబర్‌లో 30 శాతం వృద్ధి • నైట్ ఫ్రాంక్ ఇండియా వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 18(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్లు అంతకంతకు పెరుగుతున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో నగరంలో రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరిగాయని, వృద్ధిరేటు 30 శాతంగా ఉన్నదని నైట్ ఫ్రాంక్ ఇండియా తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. తాజా నివేదిక ప్రకారం 2022 సెప్టెంబర్‌లో 4,766 రిజిస్ట్రేషన్లు నమోదు కాగా, ఈ ఏడాది అదే నెలలో 6,185 రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపింది. వీటి మొత్తం ఆస్తుల విలువ రూ.3,378 కోట్లుగా ఉన్నది. వీటి విలువ గతేడాదితో పోలిస్తే 42 శాతం పెరిగింది. అమ్మకాలు జరిగిన వాటిలో ఖరీదైన నివాస గృహాలు ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నది. నివాస గృహాల మార్కెట్‌లో హైదరాబాద్ జిల్లాతో పాటు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు అత్యంత కీలకంగా ఉన్నాయి. 1,000 నుంచి 2,000 చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన గృహాలను ఎక్కువగా కొనుగోలు చేశారని, ఇది 72 శాతంగా ఉన్నదని నివేదికలో పేర్కొన్నది. అదే విధంగా బడ్జెట్ పరంగా చూస్తే రూ.25 లక్షల నుంచి 50 లక్షల విలువ చేసే నివాస గృహాల శాతం 51 శాతం ఉండగా... రూ.50 - 75 లక్షల విలువ చేసే ఆస్తులు 17 శాతం, రూ.75 లక్షల నుంచి రూ.కోటి విలువ ఆస్తులు 8 శాతం, రూ. కోటి నుంచి రూ.2 కోట్లున్న ఆస్తులు 7 శాతం, రెండు కోట్లు పైబడిన ఆస్తులు 2 శాతంగా ఉన్నాయని నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది.

జిల్లాల వారీగా జరిగిన రిజిస్ట్రేషన్లు (శాతాల్లో)

జిల్లా	2022 సెప్టెంబర్	2023 సెప్టెంబర్
హైదరాబాద్	13	14
మేడ్చల్-మల్కాజిగిరి	39	45
రంగారెడ్డి	37	41
సంగారెడ్డి	11	-

మంచిర్యాలలో ఏఎంపీఎల్ సర్వీస్ సెంటర్

హైదరాబాద్, అక్టోబర్ 18: ఆటో మోటివ్ మ్యానుఫ్యాక్చరర్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఏఎంపీఎల్)..రాష్ట్రంలో మరో సర్వీసు సెంటర్‌ను ప్రారంభించింది. మంచిర్యాలలో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో అశోక్ లేలాండ్‌కు చెందిన అన్ని రకాల వాహనాలకు సర్వీసింగ్ చేయనున్నట్టు ఏఎంపీఎల్ ఈడీ రాజీవ్ సంఘ్వీ తెలిపారు. ఈ రీజియన్‌లో ఏర్పాటు చేసిన అతిపెద్ద కమర్షియల్ వాహన సర్వీస్ సెంటర్ ఇదే.

మణిపాల్ హెల్త్ చేతికి మెడ్‌సిస్

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: మణిపాల్ గ్రూపునకు చెందిన డయాగ్నొస్టిక్స్ సేవల సంస్థ మణిపాల్ హెల్త్‌మ్యాప్.. హైదరాబాద్‌కు చెందిన మెడ్‌సిస్ పాథ్ ల్యాబ్స్‌ను హస్తగతం చేసుకున్నది. ఏప్రిల్ 2022లో మెడ్‌సిస్‌లో 84 శాతం వాటాను కొనుగోలు చేసిన సంస్థ.. ఈసారి మరో 16 శాతం వాటాను కొనుగోలు చేసింది. ప్రస్తుతం మెడ్‌సిస్‌కు 23 ల్యాబ్‌లు ఉన్నాయి.

నిరాశపరిచిన విప్రో

- **క్యూ2లో రూ.2,667 కోట్ల లాభం**

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: మరో దేశీయ ఐటీ సంస్థ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఇప్పటికే ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ ఫలితాలు ఆకట్టుకోకపోగా..తాజాగా విప్రో కూడా నిరాశపరిచింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.2,667.3 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,649.1 కోట్ల స్థాయిలోనే గడించింది. అటు ఆదాయం 3.5 శాతం పడిపోయింది. ఏడాది క్రితం రూ.22,539.7 కోట్లుగా ఉన్న కంపెనీ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.22,515.9 కోట్లకు తగ్గినట్టు పేర్కొంది. డిసెంబర్ త్రైమాసికంలో ఆదాయంలో వృద్ధి 3.5-1.5 శాతం స్థాయిలో పెరగవచ్చని సంస్థ అంచనా వేస్తున్నది. ఈ సందర్భంగా విప్రో సీఈవో థెర్రీ డెలాపోర్ట్ మాట్లాడుతూ..ద్రవ్యోల్బణం, వడ్డీరేట్లు గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో వ్యాపార రంగంలో నిరాశాజనక పరిస్థితులు నెలకొన్నాయని, అలాగే క్లయింట్లు ఖర్చులు తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం కూడా ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపాయని పేర్కొన్నారు. సంస్థకు వచ్చిన మొత్తం ఆదాయంలో ఐటీ సేవలు అందించడంతో రూ.22,395.8 కోట్లు సమకూరాయి. అలాగే వలసల రేటింగ్ 15.5 శాతానికి తగ్గడం విశేషం. గత ఆరు త్రైమాసికాల్లో ఇదే తక్కువ స్థాయి కావడం విశేషం. మొత్తం సిబ్బంది సంఖ్య ఏడు శాతం తగ్గి 2,44,707కి చేరారు.

మణిపూర్ గవర్నర్‌కు నిరసన సెగ

- **పర్యటనను అడ్డుకున్న గిరిజన మహిళలు**

ఇంఫాల్: మణిపూర్ గవర్నర్ అనసూయి యూకీకి కుకీ గిరిజన మహిళల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. బుధవారం ఉదయం చురాచాంద్‌పూర్ పట్టణంలో గవర్నర్ పర్యటనను గిరిజన మహిళలు అడ్డుకున్నారు. మైతీలు అత్యధికంగా ఉన్న రాజధాని ఇంఫాల్‌లో తాము అడుగుపెట్టే పరిస్థితి లేదని, తమకు ప్రత్యేక పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని వారు గవర్నర్‌ను డిమాండ్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గిరిజనుల డిమాండ్‌ను పలు వేదికలపై ప్రస్తావిస్తానని, తనను ముందుకు వెళ్లనివ్వాలని గవర్నర్ వారిని కోరారు. మే 3న మొదలైన మణిపూర్ అల్లర్లలో వేలాదిమంది కుకీ గిరిజనులు శరణార్థులుగా మారారు. ఘర్షణల్లో వందలాది మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు.

ఎక్స్.. ఇకపై ఉచితం కాదు!

- **1 డాలర్‌తో బేసిక్ సబ్‌స్క్రిప్షన్**

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్)లో ఖాతా కొనసాగించటం ఇకపై ఉచితం కాబోదు! ఏటా 1 డాలర్‌తో బేసిక్ సబ్‌స్క్రిప్షన్‌ను తీసుకొస్తున్నట్టు 'ఎక్స్' మంగళవారం కీలక ప్రకటన చేసింది. బేసిక్ ఫీచర్లున్న ఈ మోడల్‌ను ప్రస్తుతానికి న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్‌లలో అమలుజేయబోతున్నట్టు కంపెనీ తెలిపింది. నకిలీ ఖాతాలను అరికట్టడం కోసమే కొత్త సబ్‌స్క్రిప్షన్ మోడల్‌ను ప్రవేశపెట్టామని కంపెనీ యజమాని ఎలాన్ మస్క్ 'ఎక్స్'లో సందేశాన్ని పోస్ట్ చేశారు. సబ్‌స్క్రిప్షన్ చార్జీలు దేశాన్ని బట్టి మారుతాయని కంపెనీ వివరించింది. తాజా నిర్ణయం ప్రకారం, కొత్తగా ఎక్స్ ఖాతా తెరిచే యూజర్లు ఏడాదికి ఒక డాలర్ చెల్లించాల్సి ఉంటుంది. ఇతరుల సందేశాలను రీపోస్ట్ చేయడం, లైక్ చేయడం, బుక్‌మార్క్ చేయ డం.. మొదలైన బేసిక్ ఫీచర్లకు ఈ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఖాతా తెరిచి పోస్టులను చదవడం, ఫొటో లు, వీడియోలు చూడ్డానికి ప్రస్తుతానికి రుసుము అవసరం లేదు. తాజా నిర్ణయం ఇప్పటికే ఖాతా కలిగి ఉన్న నెటిజన్లపై ప్రభావం ఉండబోదని కంపెనీ స్పష్టం చేసింది.

'పుల్వామా'కు బాధ్యులెవరు?

- **నిఘా వైఫల్యానికి జవాబుదారీ ఎవరు?**
- **కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అమర జవాన్ల కుటుంబాల ప్రశ్న**
- **శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్**
- **నవంబర్ 26న ఢిల్లీలో ఆందోళన చేస్తామని హెచ్చరిక**

న్యూఢిల్లీ: అది 2019, ఫిబ్రవరి 14. జమ్ముకశ్మీర్‌లోని పుల్వామాలో జరిగిన ఉగ్రదాడితో దేశమంతా ఉలిక్కిపడింది. కాన్వాయ్‌పై ఉగ్రవాదులు జరిపిన బాంబు దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. లోక్‌సభ ఎన్నికలకు రెండు నెలల ముందు జరిగిన ఈ ఉగ్రదాడి, ప్రతిగా జరిపిన బాలాకోట్ వైమానిక దాడులను బీజేపీ రాజకీయంగా ఉపయోగించుకొన్నదనే విమర్శలు ఉన్నాయి. అయితే పుల్వామా ఉగ్రదాడిని పసిగట్టడంలో నిఘా వర్గాల వైఫల్యం చెందాయనే ఆరోపణలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. దీనిపై ప్రతిపక్షాలతోపాటు అన్ని వర్గాల నుంచి మోదీ సర్కార్‌కు ప్రశ్నలు ఎదురయ్యాయి.. ఎదురవుతున్నాయి! తాజాగా నిఘా సంస్థల వైఫల్యం ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని బాధిత అమర జవాన్ల భార్యలు, కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలకు సంబంధించి జవాబుదారీతనాన్ని నిర్ధారిస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని కోరుతున్నారు. ఈ డిమాండ్‌తో అమర జవాన్ల కుటుంబసభ్యులు వచ్చే నవంబర్ 26న దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళన చేపట్టనున్నారని మాజీ పారామిలటరీ దళాల సంక్షేమ సంఘం జాతీయ సమన్వయకర్త రణబీర్ సింగ్ వెల్లడించారు.

జవాబుదారీతనంలో కేంద్రం విఫలం

పుల్వామా ఉగ్రదాడి జరిగి నాలుగేండ్లకుపైగా గడిచిందని, 40 మంది జవాన్ల మృతికి దారితీసిన అధికారుల వైఫల్యానికి జవాబుదారీతనం, బాధ్యతను నిర్ణయించడంలో ప్రభుత్వం విఫలమైందని రణబీర్ సింగ్ విమర్శించారు. ఎన్నికల సమయంలో జాతీయవాదం గురించి చెప్పే మోదీ సర్కార్.. 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల మృతికి దారితీసిన కారణాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిఘా వైఫల్యానికి బాధ్యులెవరో తెలుసుకొనే హక్కు బాధిత కుటుంబసభ్యులకు ఉందన్నారు. మోదీ ప్రభుత్వ నిఘా వైఫల్యం కారణంగానే పుల్వామా దాడి ఘటన జరిగిందని జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ ఓ ఇంటర్వ్యూలో చెప్పిన విషయాన్ని రణబీర్ పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పుల్వామా దాడి జవాబుదారీతనాన్ని నిర్ధారించకుండా.. డిమాండ్ చేసిన వారిపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి వారి నోరు మూయించేందుకు ప్రయత్నిస్తున్నదని రణబీర్ ఆరోపించారు. సత్యపాల్ మాలిక్‌కు సీబీఐ ఇచ్చిన సమన్లను ఆయన ప్రస్తావించారు.

మళ్లీ ఎన్నికలకు ముందు జరుగబోయేదేమో..!

జవాన్లను తరలించేందుకు విమానం ఇవ్వాలన్న అభ్యర్థనను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించిందని చెప్పడంతో.. 'మీరు ఇప్పుడు సైలెంట్‌గా ఉండండి' అని మోదీ తనతో అన్నారని మాలిక్ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. పుల్వామా దాడి జవాబుదారీతనాన్ని నిర్ధారించడంలో నాలుగేండ్లుగా మోదీ సర్కార్ విఫలమైందని, ఎన్నికల్లో గెలువడమే వారి ప్రథమ ప్రాధాన్యతం అని మాలిక్ విమర్శించారు. దేశ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఈసారి లోక్‌సభ ఎన్నికలకు ముందు కూడా పుల్వామా తరహా ఘటనలు జరుగొచ్చని హెచ్చరించారు. 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల మరణాలు, బాలాకోట్ దాడులను 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో మోదీ రాజకీయంగా ఉపయోగించుకొన్నారని, మొదటిసారి ఓటేసే వారు తమ ఓటును బాలాకోట్‌పై వైమానిక దాడులు చేసిన వీర సైనికులకు అంకితం ఇవ్వాలని పిలుపునిచ్చిన విషయాన్ని పేర్కొన్నారు.

గంటకు 23 మంది టెకీలకు ఉద్వాసన

ప్రపంచవ్యాప్తంగా గత రెండేండ్లుగా ఐటీ పరిశ్రమ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. పలు సంస్థలు తమ సిబ్బందిని తొలగిస్తూ వస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన ఆర్థిక మాంద్యం కారణంగా ఈ పరిశ్రమ ఇంకా కోలుకోలేదు. ప్రాజెక్టులు లేకపోవడం, లాభాలు దిగజారడం వంటి పరిస్థితుల వల్ల మరింతగా ఖర్చు తగ్గించుకోవాలని భావిస్తున్న ఐటీ సంస్థలు తమ ఉద్యోగుల తొలగింపును కొనసాగిస్తున్నాయి.

ఉద్యోగాల కోత ఇలా..

గత రెండేండ్లలో ఉద్యోగాలు కోల్పోయిన ఐటీ ఉద్యోగులు **4,04,962** మంది

గంటకు **23** మంది

రోజుకు **555** మంది

2022లో

ఉద్యోగులను తొలగించిన కంపెనీలు **1,061**

ఉద్యోగాలు కోల్పోయిన మొత్తం టెకీలు **1,64,769** మంది

2023లో

ఉద్యోగులను తొలగించిన కంపెనీలు **1059**

ఉద్యోగాలు కోల్పోయిన టెకీలు **2,40,193** మంది

భారత్‌లో 70 స్టార్టప్‌లు సుమారు 21వేల మంది ఉద్యోగులను తొలగించాయి.

స్టార్టప్‌ల నుంచి గూగుల్ వరకు అదే దారి

గత రెండేండ్లుగా ఎప్పుడు ఉద్యోగం పోతుందో తెలియక ఐటీ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి గంటకు 23 మంది టెకీలు ఉద్యోగాలు కోల్పోతున్నట్టు ఒక నివేదిక తెలియజేసింది. లేఆఫ్.ఎఫ్‌వైఐ వెబ్‌సైట్ తెలియజేసిన వివరాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 2,120 టెక్ కంపెనీలు నేటి వరకు 4,04,962 మంది ఉద్యోగులను ఇంటికి పంపాయి. ఇలా తొలగిస్తున్న వాటిలో స్టార్టప్‌ల నుంచి గూగుల్ వరకు దేనికీ మినహాయింపు లేదు. వచ్చేవారంలో మరిన్ని కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తాయని వార్తలొస్తున్నాయి. యూఎస్‌కు చెందిన ప్రముఖ చిప్ తయారీ సంస్థ క్వాల్‌కామ్ 1,258 మంది తీసివేయాలని యోచిస్తున్నది. అలాగే అమెరికేతర సంస్థలైన చైనాలిసిస్, ఫ్లిక్స్, సిస్కో, పై ఇన్సూరెన్స్‌లు వందలాది మందిని, ఎపిక్ గేమ్స్ 16 శాతం అనగా 870 మందిని ఇంటికి పంపడానికి రంగం సిద్ధం చేస్తున్నాయి.

రాష్ట్రపతి ముర్ము స్వస్థలానికి తొలి ప్యాసింజర్ రైలు

- **కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్**

భువనేశ్వర్, అక్టోబర్ 18: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వస్థలం ఒడిశాలోని రాయ్‌రంగ్‌పూర్, బాదంపహార్ రూట్‌లో మొట్టమొదటిసారిగా ప్యాసింజర్ రైలు సేవలు అందుబాటులోకి రాబోతున్నాయి. టాటా-బాదంపహార్ రూట్‌లో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభిస్తున్నట్టు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం వెల్లడించారు. ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న స్థానికుల డిమాండ్‌ను నెరవేర్చామని ఆయన అన్నారు. రాష్ట్రపతి సొంత జిల్లా మయూర్‌భంజ్‌కు మూడు కొత్త రైళ్లను కేటాయించినట్టు తెలిపారు. ప్రతి శనివారం షాలిమార్‌లో బయల్దేరే వీక్లీ ఎక్స్‌ప్రెస్, బాదంపహార్‌కు అదే రోజు సాయంత్రం 5.40కు చేరుకుంటుంది. బాదంపహార్-రూర్కెలా వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం ఉదయం బాదంపహార్ నుంచి బయల్దేరుతుంది.

దవాఖానపై దాడి మా పని కాదు!

- **ఇస్లామిక్ జిహాద్ గ్రూపు రాకెట్ మిస్ ఫైర్ కారణంగానే ఘటన**
- **హమాస్ ఆరోపణలపై ఇజ్రాయెల్**

గాజా సిటీ/జెరూసలేం, అక్టోబర్ 18: గాజాలోని ఓ దవాఖానపై మంగళవారం జరిగిన బాంబు దాడి ఘటనపై హమాస్, ఇజ్రాయెల్ పరస్పర ఆరోపణలు చేసుకొంటున్నాయి. ఇజ్రాయెల్ సైన్యమే ఈ రాకెట్ దాడికి పాల్పడిందని హమాస్ గ్రూపు ఆరోపిస్తుండగా.. తమకు సంబంధం లేదని ఇజ్రాయెల్ సైన్యం చెబుతున్నది. దాదాపు 500 మంది మరణించిన ఈ దాడి ఘటనలో తమ పాత్ర ఏమాత్రం లేదని ఇజ్రాయెల్ బెంజిమెన్ నేతన్యాహూ ప్రభుత్వం చెప్పుకొస్తున్నది. ఇదే సమయంలో గాజాలోని పాలస్తీనా మిలిటెంట్ గ్రూపు ఇస్లామిక్ జిహాద్ ప్రయోగించిన రాకెట్ మిస్ ఫైర్ అయిన కారణంగా ఈ ఘటన జరిగిందని ఇజ్రాయెల్ మిలటరీ పేర్కొన్నది. ఈ మేరకు తమ వాదనను సమర్థించుకొనేందుకు పేలుడుకు సంబంధించిన వీడియోలను బుధవారం విడుదల చేసింది. ఈ ఘటనలో రాకెట్ భవనంపై పడిన తర్వాత మంటలు రేగాయని, అయితే తమ రాకెట్లతో తీవ్ర ప్రభావం ఉంటుందని, పెద్ద గోయ్యి కూడా ఏర్పడుతుందని, అయితే అక్కడ అలా జరుగలేదని పేర్కొన్నది. మరోవైపు గాజా దవాఖానపై దాడి ఘటనలో ఇజ్రాయెల్‌పై హమాస్ చేస్తున్న ఆరోపణలను అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఖండించారు. ఈ దాడి ఇజ్రాయెల్ చేయలేదని, అది మిలిటెంట్ల పనేనని, ఈ మేరకు తమ రక్షణ విభాగం నుంచి డాటా వచ్చిందని పేర్కొన్నారు.

మానవతా సాయానికి అంగీకారం

ఈజిప్టు గుండా గాజాలోని పౌరులకు మానవతా సాయాన్ని అందించేందుకు ఇజ్రాయెల్ అంగీకారం తెలిపిందని బైడెన్ వెల్లడించారు. గాజా, వెస్టుబ్యాంకుకు అమెరికా తరఫున 100 మిలియన్ డాలర్ల సాయం అందించనున్నట్టు తెలిపారు. మరోవైపు ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులు, పౌరులపై హింసను ఖండిస్తూ, గాజాలోని పాలస